# అన్ని కాలనీల సమగ్రాభివృద్ధే ధ్యేయం

## నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, డిసెంబర్ 30: ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులకు ఎల్లవేలలా రుణపడి ఉంటానని, నియోజకవర్గంలోని అన్ని కాలనీల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకువెళ్తానని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సుందరయ్య విజ్ఞన కేంద్రంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 'ఆత్మీయ అభినందన సభ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ముచ్చటగా మూడవ సారి భారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేలలా రుణపడి ఉంటానని, నాపై విశ్వాసంతో గెలిపించినందుకు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, కార్పొరేటర్లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీకి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కరుణాకర్, ట్రెజరర్ మహేందర్, సభ్యులు నాగిరెడ్డి, సంజయ్, మధు, వేణు, చంద్రశేఖర్, రఘు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సత్కరిస్తున్న ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్



## ఎమ్మెల్యే మాగంటి ప్రత్యేక పూజలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శనివారం కుటుంబసమేతంగా కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

– బంజారాహిల్స్, డిసెంబర్ 30



## 'ప్రజాపాలన' కేంద్రాలు పరిశీలన

చందానగర్ సర్కిల్ పరిధిలో 'ప్రజాపాలన' కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ శనివారం కొనసాగింది. సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో మొత్తం 64 కౌంటర్లలో ప్రజల నుంచి అధికారులు, సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. అత్యధికంగా గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కాగా దరఖాస్తు కేంద్రాలను సర్కిల్ డీసీ వంశీకృష్ణ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

– మియాపూర్ , డిసెంబర్ 30

## రైల్వే స్టేషన్‌లో లిఫ్టుల ఏర్పాటుకు వినతి

మాదాపూర్, డిసెంబర్ 30: చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో రెండువైపులా ఉన్నటువంటి ఫ్లాట్‌ఫారంలకు లిఫ్టులను ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ శనివారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీడీ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. త్వరలో ప్రయాణికుల సమస్యలను పరిష్కారిస్తానని మిశ్రా తెలిపారు.

## 'నూతన' వేడుకలపై ప్రత్యే నిఘా

● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఏసీపీ హరిప్రసాద్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 30: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలపై పోలీసులు పటిష్టమైన నిఘా పెడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత వేడుకలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పబ్‌ల యాజమాన్యాలకు, ఈవెంట్‌ల నిర్వాహకులకు పోలీసులు వేడుకల నిర్వహణపై ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం యూసుఫ్‌గూడలో పర్యటించిన జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ.. న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమించరాదని, ప్రధానంగా బార్లు, పబ్‌లు, రెస్టారెంట్‌లపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. వేడుకల్లో భాగంగా కేక్ సెలబ్రేషన్‌లు, ఇతరత్రా వేడుకలు అర్ధరాత్రి 1 గంటలోపే పూర్తిచేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## వృద్ధులకు 'సంస్కృతి' విద్యార్థుల చేయూత



కూకట్‌పల్లిలోని శ్రీమాతా వృద్ధాశ్రమంలోని తలదాచుకుంటున్న 35 మంది వృద్ధులకు శనివారం 'సంస్కృతి' హైస్కూల్ విద్యార్థులు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను, చీరలు, నైటీలు, శాలువాలు అందజేసి వృద్ధులకు అండగా నిలిచారు. భోజనం, పండ్లు, కూరగాయలు, బ్రెడ్ ప్యాకెట్లు, స్వీట్లు అందించి విద్యార్థులు పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

– మాదాపూర్, డిసెంబర్ 30



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకుస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

## అయ్యప్ప స్వామి పూజలో ఎమ్మెల్యేగాంధీ

మియాపూర్ , డిసెంబర్ 30: కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 3 శివాలయంలో శనివారం జరిగిన అయ్యప్ప పడి పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, శ్రీనివాస్, రాధాకృష్ణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. గంగారం, చందానగర్‌లకు చెందిన నూతన సంవత్సరం క్యాలండర్‌లను పార్టీ నేతలు, కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. నూతన సంవత్సరం ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.



## అలరించిన నృత్య ప్రదర్శన

కళాకారులు నృత్య ప్రదర్శనలు చేస్తు సందర్శకులను విశేషంగా అలరించారు. శనివారం అన్నమాచార్య బావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో 'లలిత ఫైన్ ఆర్ట్స్ అకాడమీ' విద్యార్థులు నృత్యార్చన చేశారు. గురువు లలిత ధనలక్ష్మితో పాటు 30 మంది శిష్య బృందం సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం డాక్టర్ శోభరాజు శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

– మాదాపూర్, డిసెంబర్ 30

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● మియాపూర్ ట్రాఫిక్ సీఐ నవీన్

మియాపూర్, డిసెంబర్30: ప్రమాద రహితమైన కొత్త సంవత్సర వేడుకలే ట్రాఫిక్ నిబంధనల లక్ష్యమని, వాహనదారులు, ప్రజలు సహకరించాలని, నిబంధనలను తప్పకుండా పాటించాలని మియాపూర్ ట్రాఫిక్ సీఐ నవీన్ కోరారు. నూతన సంవత్సరం నేపథ్యంలో వాహనదారులు తగు నిబంధనలను తప్పకుండా పాటించాలని సీఐ నవీన్ శనివారం తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము ఉదయం 4 గంటలకు ప్రత్యేక బృందాలతో రహదారులపై డ్రంకన్ డ్రైవ్ టెస్టులను విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే కఠినమైన చర్యలు తప్పవని, ఇతరులకు అసౌకర్యం కలిగేలా హారన్‌ల మోతలు మోగించినా ఊరుకోబోమని హెచ్చరించారు.

## వృద్ధుడి అదృశ్యం

మియాపూర్, డిసెంబర్ 30: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో జరిగింది. గోకుల్ ఫ్లాట్స్ 9వ ఫేజ్‌లో నివాసముండే ఎర్రోళ్ల చంద్రయ్య (70) ఈ నెల 28వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవటంతో శనివారం ఆయన కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మియాపూర్ పోలీసులు వెల్లడించారు.

## మూడో రోజు 14,155 దరఖాస్తులు

జూబ్లీహిల్స్, డిసెంబర్ 30: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 14,155 దరఖాస్తులు స్వీకరించారు. అభయ హస్తం పథకంలో 10,609 దరఖాస్తులు, రేషన్‌కార్డు తదితర ఇతర పథకాల కోసం 3,546 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ తెలిపారు. కాగా (నేడు) ఆదివారంతో పాటు నూతన సంవత్సర సందర్భంగా రెండు రోజులు ప్రజాపాలన కేంద్రాలకు సెలవు ఉంటుందని తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

మాదాపూర్, డిసెంబర్ 30: అర్హులైన ప్రతి ఒకరూ అభయహస్తం దరఖాస్తులను సమీప 'ప్రజాపాలన' కేంద్రాల్లో సమర్పించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ సూచించారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ ఏ బ్లాకులోని కమ్యూనిటీ హాల్ (బస్తీ దవాఖానా) ఆవరణలోని అంజయ్య నగర్ వార్డు కార్యాలయం, కొత్తగూడ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తు కేంద్రాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## దొంగ అరెస్ట్..

ఎర్రగడ్డ, డిసెంబర్ 30: కొంతకాలంగా బోరబండ ప్రాంతంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను బోరబండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏసీపీ వెంకటేశ్వరరావు శనివారం బోరబండ ఠాణాలో వివరాలు వెల్లడించారు. ఏపీ, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మణికంఠ ఉపాధి కోసం నగరానికి వచ్చి ఎమ్మెస్ మక్తాలో ఉంటూ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు.ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి అప్పులపాలయ్యాడు. దీంతో వచ్చే జీతం సరిపోక పోవడంతో సులభంగా డబ్బు సంపాదించి అప్పులు తీర్చాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా బోరబండ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. కొంత కాలంగా పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడ్డాడు. దొంగతనాలపై పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో దర్యాప్తు ప్రారంభించిన బోరబండ క్రైమ్ పోలీసులు సీసీఎస్ పోలీసులతో కలిసి వల పన్ని మణికంఠను పట్టుకున్నారని ఏసీపీ పేర్కొన్నారు. నిందితుడి నుంచి 54 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో 207 గ్రాముల బంగారంతో పాటు నగదును కాజేశాడని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్, డీఐ భూపాల్‌గౌడ్, సీసీఎస్ పోలీసులు పాల్గొన్నారు.